

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 12-08-2026 | సంపుటి - 31 | సంచిక - 80 | రూ : 4 | పేజీలు: 8

## మెట్రో రద్దీకి...
# అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనండి

### ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట కారిడార్

- పనులకు టెండర్ ప్రక్రియను మొదలుపెట్టాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్: 'హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకు రద్దీ పెరుగుతోంది. ప్రయాణికుల రద్దీకి తగినట్టుగా అదనపు బోగీలను జత చేయాలి. వాటిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌పై సీఎం.. మంగళవారం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ''హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశలో భాగంగా.. పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచండి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలుపెట్టాలి. ఢిల్లీ మెట్రోను సంప్రదించి.. అవసరమైన సలహాలు తీసుకోవాలి. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. డిసెంబరులో నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ స

తరువాయి 2లో

## 2 కోట్ల ఓట్లే మిగిలేటట్లున్నాయ్

- 74 లక్షల ఓట్లు అన్‌కలెక్టెబుల్‌గా ఉండటం ఆందోళనకరం
- సర్ ప్రక్రియపై సమీక్షలో కేటీఆర్

2లో



## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..
### ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం



- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

ఢిల్లీ, ఆగస్టు 11 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని

తరువాయి 2లో




## చంద్రుడిపై శాశ్వత స్థావరం..
### భారత్‌ను భాగస్వామిగా ఆహ్వానించిన నాసా

- చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద స్థావరం ఏర్పాటుకు ప్రణాళిక
- చంద్రయాన్-3 విజయంతో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు
- ఆర్టెమిస్ ఒప్పందం కింద సహకారం మరింత విస్తరణ
- ఇస్రో గగన్‌యాన్, స్పేస్ విజన్ 2047కు కొత్త ఆశలు

**బెంగళూరు, ఆగస్టు 11:** చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రణాళికలో భారత్ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. నాసా ప్రతిపాదించిన 'మూన్ బేస్' కార్యక్రమంలో చేరాలని ఇస్రోను అమెరికా ఆహ్వానించింది. బెంగళూరులో ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగిన భారత్‌అమెరికా సివిల్ స్పేస్

తరువాయి 2లో

## దోమను చంపకుండానే మలేరియాకు చెక్..
### కొత్త దోమతెరతో శాస్త్రవేత్తల ప్రయోగం



- దోమలోని పరాన్నజీవినే లక్ష్యంగా చేసుకునే రసాయనాలు
- మెరుగైన ఫలితాలు ఇచ్చిన ELQ-453, ELQ-613
- నిరోధకత సంతరించుకున్న దోమలపైనా ప్రభావం కనిపించిన వైనం
- విస్తృత వినియోగానికి ఇంకా పరీక్షలు అవసరం

ఇప్పటివరకు మలేరియా నియంత్రణలో ప్రధానంగా దోమలను చంపడంపైనే దృష్టి ఉండేది. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు ఆ ఆలోచనకు భిన్నమైన మార్గాన్ని పరీక్షించారు. దోమను చంపకుండా.. దాని శరీరంలోకి వెళ్లిన మలేరియా పరాన్నజీవిని అడ్డుకునే రసాయనాలతో దోమతెరలను తయారు చేసే అవకాశాన్ని పరిశీలించారు.

తరువాయి 2లో

## యుద్ధ నేరాల కేసులో సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు
# మరణశిక్ష



- బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష
- అసద్ తమ్ముడు మహెర్‌కూ అదే శిక్ష
- సమీప బంధువు అతీఫ్ నజీబ్‌కూ మరణశిక్ష
- యుద్ధ నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనల నేరాలపై తీర్పు
- చిన్నారుల హత్య, హింసతో దోషిగా తేలిన నజీబ్

2లో

## స్వాతంత్ర్య దినోత్సవం ముందు
# ఉగ్ర ముప్పు.. సరిహద్దుల్లో హైఅలర్ట్!



- పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన కేంద్రం
- పాక్ సరిహద్దులో బీఎస్ఎఫ్ 'ఆపరేషన్ అలర్ట్' ప్రారంభం
- బంగ్లాదేశ్ సరిహద్దు జిల్లాల్లో 40 కొత్త ఐబీ యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయం

2లో

## ఒలింపిక్స్ లక్ష్యంగా జీవీ రాజా స్టేడియం..
# రూ.100 కోట్లతో భారీ మేకోవర్!

### కేరళ జీవీ రాజా స్టేడియం అభివృద్ధికి కేంద్ర మంత్రి సురేశ్ గోపీ చొరవ

- రూ.100 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పునరుద్ధరణ
- 2036 ఒలింపిక్స్‌కు భారత్ బిడ్ నేపథ్యంలో స్టేడియం ఆధునికీకరణ
- త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయనున్న కేరళ యూనివర్సిటీ



కేరళ రాజధాని తిరువనంతపురంలోని చారిత్రక జీవీ రాజా స్టేడియం రూపురేఖలు మారనున్నాయి. ఈ స్టేడియంను ఒలింపిక్ పోటీల నిర్వహణకు అనువుగా, అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ చొరవ తీసుకున్నారు. ఇందుకు రూ.100 కోట్లతో భారీ ప్రణాళికను సిద్ధం చేస్తుండగా, ఈ మేరకు కేరళ యూనివర్సిటీ ఉన్నతాధికారులతో ఆయన చర్చలు జరిపారు.

తరువాయి 2లో

# మెట్రో రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనండి

హైదరాబాద్: 'హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకు రద్దీ పెరుగుతోంది. ప్రయాణికుల రద్దీకి తగినట్టుగా అదనపు బోగీలను జత చేయాలి. వాటిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌పై సీఎం.. మంగళవారం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ''హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశలో భాగంగా.. పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచండి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలుపెట్టాలి. దిల్లీ మెట్రోను సంప్రదించి.. అవసరమైన సలహాలు తీసుకోవాలి. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. డిసెంబరులో నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్'కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ''వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలి. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమిట్ ఏర్పాట్లు ఉండడం చాలా ముఖ్యం. గత ఏడాది నిర్వహించిన సదస్సులో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించండి. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారుచేయాలి'' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు కె.రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

*** పేద పిల్లల కలలకు చిరునామా..**

**ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్: సీఎం**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై మంగళవారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. ''భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవ భారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# చంద్రుడిపై శాశ్వత స్థావరం.. భారత్‌ను భాగస్వామిగా ఆహ్వానించిన నాసా

(మొదటిపేజీ తరువాయి)

జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమా వేశంలో ఈ ఆహ్వానం అందింది.

**చంద్రుడిపై శాశ్వత స్థావరం**

చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవులు నివసించే తొలి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్నది నాసా ప్రణాళిక. వ్యోమగాములు అక్కడ నివసించడంతో పాటు పరిశోధనలు చేయనున్నారు. ఇందుకోసం మానవ సహిత, మానవ రహిత మిషన్ల ద్వారా అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికే నాసా ప్రాధాన్యం ఇస్తోంది. అక్కడ శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో మంచు రూపంలో నీరు ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆ నీటిని తాగడానికి, ఆక్సిజన్, రాకెట్ ఇంధనంగా మార్చుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో అంగారకుడిపై మానవ యాత్రలకు చంద్రుడిని కీలక కేంద్రంగా ఉపయోగించుకోవాలన్నది నాసా లక్ష్యం.

**భారత్ అనుభవానికి గుర్తింపు**

చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2023 ఆగస్టులో చంద్రయాన్3లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ అక్కడ దిగాయి. ల్యాండింగ్ ప్రాంతానికి 'శివశక్తి పాయింట్'గా పేరు పెట్టారు. నాసా ఇప్పుడు అదే ప్రాంతంలో స్థావరం ఏర్పాటుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇస్రో అనుభవం కీలకంగా మారనుంది.

**ఆర్టెమిస్ ఒప్పందంతో ముందుకు**

మూన్ బేస్ సహకారం ఆర్టెమిస్ అకార్డ్స్ కింద భారత్‌అమెరికా భాగస్వామ్యానికి కొనసాగింపుగా ఉండనుంది. శాంతియుత, పారదర్శక, సుస్థిర అంతరిక్ష అన్వేషణకు ఈ ఒప్పందం మార్గదర్శకంగా ఉంటుంది. 2023 జూన్ 21న భారత్ ఆర్టెమిస్ అకార్డ్స్‌పై సంతకం చేసింది. బెంగళూరు సమావేశంలో అంతరిక్ష పరిశోధనల నుంచి లభించే శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంపైనా చర్చలు ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

**నిసార్ నుంచి చంద్రుడి వరకు**

భారత్, అమెరికా ఇప్పటికే నిసార్ ఉపగ్రహం ద్వారా భారీ అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. భవిష్యత్‌లో శాస్త్రీయ పరిశోధనలు, మానవ అంతరిక్ష ప్రయాణ సాంకేతికతపై కలిసి పనిచేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు. భారత్ గగన్‌యాన్ కార్యక్రమంతో మానవ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతోంది. అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, భవిష్యత్తులో చంద్రుడిపై మానవ కార్యకలాపాల వంటి లక్ష్యాలను 'స్పేస్ విజన్ 2047'లో భారత్ నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో నాసా ఆహ్వానం ఇస్రోకు కీలక అవకాశంగా మారనుంది.

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ''ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం'' అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

# 2 కోట్ల ఓట్లే మిగిలేటట్లున్నాయ్

హైదరాబాద్: సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా భారాస శ్రేణులు అవసరమైన చర్యలు చేపట్టాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. సర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో మొత్తం 3.39 కోట్ల ఓట్లున్నాయని, ఇందులో దాదాపు 74 లక్షల ఓట్లు 'అన్‌కలెక్టబుల్'గా ఉండడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం సర్‌పై పార్టీ కమిటీ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ''మొత్తం ప్రక్రియ పూర్తయ్యే నాటికి కేవలం రెండు కోట్ల ఓట్లు మాత్రమే మిగిలే పరిస్థితి కనిపిస్తోంది. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయినట్లయితే వారికి న్యాయం చేయడానికి ఎలాంటి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలో.. ఈనెల 13, 14 తేదీల్లో సమావేశాలు నిర్వహించి.. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తో చర్చించిన అనంతరం కార్యాచరణను వెల్లడిస్తాం'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# 500 మీటర్ల త్రివర్ణ పతాక ప్రదర్శన



మెట్‌పల్లి పట్టణం: జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో భాజాపా నేతలు హర్ ఘర్ తిరంగాలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. మెట్‌పల్లిలో ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆదేశాలతో మంగళవారం 500 మీటర్ల త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని ప్రధాన రహదారిపై విద్యార్థులు, నాయకులు ర్యాలీ తీశారు. సుల్తానాబాద్‌లో 1,500 మంది విద్యార్థులతో కలిసి 200 మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ చేపట్టారు. మానవహారంగా ఏర్పడి ప్రత్యేక ప్రదర్శనిచ్చారు. దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవం ముందు ఉగ్ర ముప్పు.. సరిహద్దుల్లో హైఅలర్ట్!

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడవచ్చన్న సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేస్తూ కీలక చర్యలు చేపట్టింది. ఆగస్టు 15న ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో భద్రతా బలగాల దృష్టి వేడుకలపై కేంద్రీకృతమై ఉంటుందని, ఇదే అదనుగా దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ భావిస్తున్నట్లు 'ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఐబీ) అధికారి ఒకరు తెలిపారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే), బలూచిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఐఎస్ఐ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను చొరబడేలా చేయడం, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా పంపడం వంటి ప్రయత్నాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా, భద్రత తక్కువగా ఉండే టైర్ 2 నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉంది. కొన్నిసార్లు భద్రతా ఏజెన్సీల దృష్టిని పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ లేదా కశ్మీర్‌లో దాడులంటూ తప్పుడు సమాచారం సృష్టించి, మరోచోట దాడికి దిగే వ్యూహం కూడా ఐఎస్ఐ అనుసరించవచ్చని ఓ అధికారి వివరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) 'ఆపరేషన్ అలర్ట్'ను ప్రారంభించింది. ఆగస్టు 10 నుంచి 17 వరకు కొనసాగే ఈ ఆపరేషన్‌లో భాగంగా బీఎస్ఎఫ్ సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తూ, నిఘా మరియు పెట్రోలింగ్‌ను గణనీయంగా పెంచారు. మరోవైపు, బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రతను పటిష్ఠం చేసేందుకు పశ్చిమ బెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో సుమారు 40 'సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఎస్ఐబీ) యూనిట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సరిహద్దు అత్యంత సున్నితమైనది కావడంతో శాశ్వత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి చొరబాట్లు, స్మగ్లింగ్

# ఒలింపిక్స్ లక్ష్యంగా జీవీ రాజా స్టేడియం.. రూ.100 కోట్లతో భారీ మేకోవర్!

(మొదటిపేజీ తరువాయి)

సురేశ్ గోపీ ఇటీవల కేరళ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ మోహనన్ కున్నుమ్మల్, యూనివర్సిటీ సిండికేట్ ఫైనాన్స్ సభ్యుడు ఆర్.ఎస్. శశికుమార్‌తో కలిసి స్టేడియంను సందర్శించారు. ఈ స్టేడియం యాజమాన్యం కేరళ యూనివర్సిటీ పరిధిలోనే ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉందని సురేశ్ గోపీ తెలిపినట్లు శశికుమార్ వెల్లడించారు. త్వరలోనే యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఒక మాస్టర్ ప్లాన్, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సురేశ్ గోపీ సానుకూల దృక్పథంతో ఈ స్టేడియం ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2036 సమ్మర్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వాలని భారత్ బలంగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒలింపిక్స్ కోసం అహ్మదాబాద్ నగరాన్ని ప్రధాన వేదికగా ప్రతిపాదించినప్పటికీ, ఈ క్రీడల కోసం తిరువనంతపురంలోని ఈ స్టేడియంను కూడా ఒక ముఖ్యమైన అథ్లెటిక్స్ వేదికగా తీర్చిదిద్దే అవకాశం ఉంది. గతంలో అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన ఈ స్టేడియం, కొన్నేళ్లుగా సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరింది. సింథటిక్ ట్రాక్, ఇతర సౌకర్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 1937లో ట్రావెన్‌కోర్ యూనివర్సిటీలో భాగంగా నిర్మించిన ఈ స్టేడియం, దాదాపు తొమ్మిది దశాబ్దాల చరిత్రకు చేరువవుతోంది. కేరళ క్రీడారంగ పితామహుడిగా పేరుగాంచిన కల్నల్ గోదవరం రాజా (జీవీ రాజా) పేరును ఈ స్టేడియంకు పెట్టారు. ఆయన కేరళలో అథ్లెటిక్స్, క్రికెట్, ఫుట్‌బాల్‌ను ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు.

# దోమను చంపకుండానే మలేరియాకు చెక్.. కొత్త దోమతెరతో శాస్త్రవేత్తల ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

**పాత పద్ధతికి సవాల్**

మలేరియా నియంత్రణలో ఇన్‌సెక్టిసైడ్ ట్రీటెడ్ బెడ్ నెట్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. దోమతెరను తాకిన దోమలను క్రిమిసంహారకాలు చంపడం లేదా నిర్వీర్యం చేయడం ద్వారా మనుషులకు మలేరియా సోకకుండా అడ్డుకుంటాయి. అయితే కాలక్రమేణా కొన్ని ప్రాంతాల్లో దోమలు ఈ క్రిమిసంహారకాలకు నిరోధకతను పెంచుకుంటున్నాయి. దీంతో పాత పద్ధతి ప్రభావం తగ్గుతోంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా మలేరియా కారణంగా 26.3 కోట్ల కేసులు, 5.97 లక్షల మరణాలు నమోదైనట్లు అధ్యయనం పేర్కొంది.

**పరాన్నజీవిని టార్గెట్ చేస్తే?**

ఇక్కడే కొత్త పరిశోధన ఆసక్తికరంగా మారింది. హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు అనుబంధ పరిశోధకుల నేతృత్వంలోని 2025 అధ్యయనంలో దోమను చంపడం కాకుండా.. దోమలో పెరిగే 'ప్లాస్మోడియం ఫాల్సిపేరం' పరాన్నజీవిని లక్ష్యంగా చేసుకున్నారు. మలేరియా సోకిన రక్తాన్ని పీల్చిన తర్వాత పరాన్నజీవి కొంతకాలం దోమ శరీరంలోనే అభివృద్ధి చెందుతుంది. చివరకు దోమ లాలాజల గ్రంథులకు చేరిన తర్వాత మరో మనిషిని కుట్టినప్పుడు మలేరియా వ్యాప్తి చెందుతుంది. ఈ మధ్యంతర దశనే పరిశోధకులు లక్ష్యంగా చేసుకున్నారు.

**81 సమ్మేళనాల పరీక్ష**

పరిశోధకులు మలేరియాపై ఇప్పటికే తెలిసిన 81 సమ్మేళనాలను పరీక్షించారు. ఇవి 28 రకాల విధానాల్లో పరాన్నజీవిపై పనిచేసే రసాయనాలు. వీటిలో 22 సమ్మేళనాలు మలేరియా పరాన్నజీవి అభివృద్ధిని గణనీయంగా అడ్డుకున్నాయి. వాటిలో ELQ453, ELQ613 అనే రెండు సమ్మేళనాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఇవి పరాన్నజీవి మైటోకాండ్రియాలోని ఒక ముఖ్యమైన కాంప్లెక్స్‌లోని వేర్వేరు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటాయి.

**దోమతెరను కేవలం తాకితే చాలు!**

ప్రయోగశాలలో రసాయనాన్ని నేరుగా దోమపై వేయడం ఒక విషయం. కానీ దోమతెరపై రసాయనం ఉండి.. దోమ తన కాళ్లతో కొన్ని క్షణాలు తాకినప్పుడు అది దోమ శరీరంలోకి చేరాలి. ఇదే ఈ పరిశోధనలో కీలకమైన సవాలు.




13 సమ్మేళనాలను దోమ కాళ్ల ద్వారా శరీరంలోకి ప్రవేశించే సామర్థ్యంపై పరీక్షించగా.. ELQ 456 మాత్రమే స్పష్టమైన యాంటీపారాసిటిక్ ప్రభావాన్ని చూపింది. తర్వాత రసాయన నిర్మాణంలో చిన్న మార్పులు చేసి ELQ 453, ELQ613లను అభివృద్ధి చేశారు. ఈ సమ్మేళనాలను కలిపి ఉపయోగించినప్పుడు మలేరియా పరాన్నజీవి సంక్రమణను మరింత సమర్థంగా అడ్డుకున్నాయి.

**దోమ బతికినా.. మలేరియా వ్యాప్తి కాదు!**

ఈ విధానంలో ఆసక్తికరమైన అంశం ఇదే. దోమతెరను తాకిన వెంటనే దోమ చనిపోవాల్సిన అవసరం లేదు. అది బతికి తర్వాత మలేరియా సోకిన వ్యక్తిని కుట్టినా.. దాని శరీరంలో పరాన్నజీవి సాధారణంగా అభివృద్ధి చెందకుండా చేయడమే లక్ష్యం. ఇప్పటికే మలేరియా పరాన్నజీవిని మోస్తున్న దోమలపై కూడా ఈ సమ్మేళనాలు ప్రభావం చూపించాయి. పరాన్నజీవి అభివృద్ధి నెమ్మదించడం, దాని సంఖ్య తగ్గడం, లాలాజల గ్రంథులకు చేరే పరాన్నజీవుల శాతం తగ్గడం వంటి ఫలితాలు కనిపించాయి.

**రెండు రసాయనాలు.. నిరోధకతకు డబుల్ అడ్డుకట్ట?**

మరో ముఖ్యమైన అంశం రెండు సమ్మేళనాలను కలిపి ఉపయోగించడం. ELQ453 ఒక ప్రాంతాన్ని, ELQ613 మరో ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుంటాయి. ఒక ప్రాంతంలో మార్పు చెందిన పరాన్నజీవులు మరో సమ్మేళనానికి కూడా నిరోధకత చూపుతాయా అని పరిశోధకులు పరిశీలించారు. పరీక్షించిన పరిస్థితుల్లో అలాంటి క్రాస్‌రెసిస్టెన్స్ కనిపించలేదు. అంటే భవిష్యత్తులో ఈ రెండు రకాల సమ్మేళనాలను కలిపి ఉపయోగించడం ద్వారా పరాన్నజీవిలో నిరోధకత అభివృద్ధి చెందడాన్ని మరింత కష్టతరం చేసే అవకాశం ఉంది.

**దోమతెరల్లో కలిపినా పనిచేశాయి**

పరిశోధకులు ఈ సమ్మేళనాలను ప్లాస్టిక్ ఫిల్మ్‌లలో కలిపి పరీక్షించారు. తయారీ సమయంలో 150 డిగ్రీల సెల్సియస్ వరకు వేడి చేసినప్పటికీ వాటి ప్రభావం కొనసాగింది. అంతేకాదు.. గది ఉష్ణోగ్రత వద్ద వెలుతురుకు గురై ఏడాది పాటు నిల్వ చేసిన తర్వాత కూడా ప్రభావం కనిపించింది. క్రిమిసంహారకాలకు నిరోధకత ఉన్న దోమలపై కూడా ఇవి పనిచేశాయి. పాలిస్టర్ దోమతెరలతో చేసిన ప్రయోగాల్లోనూ మలేరియా పరాన్నజీవి సంక్రమణను పూర్తిగా అడ్డుకునే ఫలితాలు కనిపించాయి.

**ఇప్పుడే మార్కెట్‌లోకి రావు**

ఈ ఫలితాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ.. ఈ దోమతెరలు వెంటనే మార్కెట్‌లోకి వచ్చేస్తాయని చెప్పలేం. ఇప్పటివరకు జరిగిన పరీక్షలు ప్రధానంగా ప్రయోగశాల పరిస్థితుల్లోనే జరిగాయి. నిజ జీవిత పరిస్థితుల్లో దోమతెరలు ఎంతకాలం ప్రభావవంతంగా ఉంటాయి? ఉష్ణోగ్రత, తేమ, వాడకం వంటి పరిస్థితుల్లో రసాయనాలు ఎలా పనిచేస్తాయి? మనుషులకు ఎంతవరకు సురక్షితం? వంటి అంశాలపై మరిన్ని పరీక్షలు అవసరం.

**మలేరియా నియంత్రణలో కొత్త ఆలోచన**

ఇప్పటివరకు దోమతెర అంటే.. దోమను చంపే ఆయుధం. ఈ పరిశోధన మాత్రం దోమతెరను మరో విధంగా ఉపయోగించే అవకాశాన్ని చూపిస్తోంది. దోమను చంపాల్సిన అవసరం లేదు.. అది మలేరియాను వ్యాప్తి చేయలేకపోతే చాలు.

# సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను భావితరాలకు చాటిచెప్పాలి

*** 'సర్దార్ సర్వాయి పాపన్న సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్,ప్రజాస్ఫూర్తి : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఆగస్టు 21న విడుదల కానున్న 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమా ట్రైలర్‌ను రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని,పోస్టర్ కూడా చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించి, మన ప్రాంతాన్ని మనమే పరిపాలించుకోవాలనే ఆలోచనతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం సాగించారని అన్నారు. గోల్కొండను వేదికగా చేసుకొని బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు ఆయన కృషి చేశారని తెలిపారు. ఆయన చరిత్రను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశాలు

జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లాలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పలు ఉద్యోగాల భర్తీకి అధికారులు నోటిఫికేషన్ విడుద ల చేశారు.జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ పరిధిలో డే టా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అలాగే జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ పరి ధిలో ఐదు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అ ర్హులైన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఉద్యోగాలకు సంబంధిం చిన అర్హతలు, దరఖాస్తు విధానం,గడు వు తదితర పూర్తి వివరాల కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించ వచ్చు(https:referenceurlcitation.invalid /0). అలాగే కలెక్టరేట్ లోని ఎస్సీ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

# సెప్టెంబర్ 1న సిపిఐ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ

*** సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ పిలుపు.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : బిజెపి ప్రభుత్వం ఆదికారంలోకి వచ్చిన నాటి నుండి డిజిల్ పెట్రోల్,వంట గ్యాస్ సిలిండర్ల ధరలు నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా పెంచి దేశ ప్రజలపై పెనుభారం మోపుతుందని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెంచిన అధిక ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్ అన్నారు.మంగళవారం మండలంలోని మహ్మదపూర్, నాగారం, జిల్లెల్లగడ్డ, మీర్జాపుర్, హుస్నాబాద్ పట్టణం,పందిల్ల, కుచనపల్లి, పోట్లపల్లి,దేవేంద్ర నగర్ గ్రామాల్లో సిపిఐ జాత కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మోడి నియంతృత్వ పోకడలపై ప్రజా యుద్ధానికి సిద్ధం కావాలని అన్నారు. ఆగస్టు 6 నుండి జరుగుతున్న సిపిఐ ప్రజా చైతన్య యాత్ర ముగింపు బహిరంగ ఆగస్టు 13న హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ సీనీయర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్,తెలంగాణ ప్రజా నాట్య మండలి కళాకారులు హాజరౌతున్నారని సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ జాగిర్ సత్యనారాయణ, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్, సిపిఐ వివిధ గ్రామ శాఖ కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఆహ్వానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం నూతన చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పస్తం గంగరాములు, నూతనంగా ఎన్నికైన ధర్మకర్తలు వర్కాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గుగులోతు అరుణ నాయక్, బొబ్బిళ్ళ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి 'డయల్ యువర్ డీఎం

జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ డిపో పరిధిలో 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నేడు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.ఉష ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు, ప్రజలు తమ సలహాలు ,సూచనలు, సమస్యలను నేరుగా డిపో మేనేజర్ 9959226050 ఫోన్ నంబర్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియో గం చేసుకోవాలని ఆమె కోరారు.

# రాజకీయ పార్టీలకు సముచిత సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలి

*** రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : మంగళవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో రేషనలైజ్ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి పంపించేందుకు చేపట్టిన ప్రక్రియలో భాగంగా, సైట్ గడువు సమయం ముగిసిన నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. గడువు ముగిసినందున అందిన ప్రతిపాదనలను పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు కొరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు. రేషనలైజ్ ప్రతిపాదనల విషయంలో పారదర్శకత, నిబంధనల అమలు, అన్ని రాజకీయ పార్టీలకు సముచిత సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 257 ఎక్సిస్టింగ్ పోలికేంద్రాలు ఉండగా అదనముగా 5 ,ఆలేరు నియోజకవర్గానికి సంబంధించి 309 ఎక్సిస్టింగ్ పోలికేంద్రాలు ఉండగా అదనముగా 4, మొత్తం పోలింగ్ స్టేషన్స్ రేష్నలైజేషన్ చేసిన తరువాత 575 అయ్యాయని పార్టీ ప్రతినిధులకు వివరించారు. మార్పులు, విలీనాలు లేదా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయంలో ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతిపాదిత మార్పులపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, ఇతర అధికారులు , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంతో పోటీపడాలి

*** శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్ సతీష్ కుమార్,**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : నైపుణ్యాభివృద్ధి లేని చదువు నిరర్థకమని ఆచార్య పి. సతీష్‌కుమార్, రిజిస్ట్రర్, శాతవాహన విశ్వవిద్యాలయం తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ నందు మూడు రోజులపాటు ట్యాలీ ఈ. ఆర్. పి సాఫ్ట్వేర్ ద్వారా ఖాతాల గణ మరియు నిర్వహణ అనే అంశంపై కార్యశాల నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాతవాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి సతీష్ కుమార్ తన ప్రారంభోపన్యాసంలో సాంకేతిక నైపుణ్యాల ఆవశ్యకతను మరియు ప్రాధాన్యతను వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాలలోనిరంతరం వస్తున్న మార్పులను గమనించాలని దానికి అనుగుణంగా సామర్థ్యాలను పెంచుకోవాలని కోరారు. దార్శనికత, స్పష్టత లేని చదువుతో, పోటీ ప్రపంచంలో మన లేరని విద్యార్థులకు హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యా అనేది నిరంతర అభ్యసనమని, ప్రతి మనిషి నిత్య విద్యార్థి అని తెలిపారు. ఆన్లైన్ చెల్లింపులు మరియు అంతర్జాల సేవల వలన వాణిజ్య శాస్త్ర పరిధి బాగా పెరిగిందని తెలుపుతూ ట్యాలీ సాఫ్ట్వేర్ ద్వారా ఖాతాల నిర్వహణ సులభతరం అవుతుందని వివరించారు. వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తేదీ 11 నుండి 13 వరకు జరిగే మూడు రోజుల కార్యశాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొని నైపుణ్యాలను పెంచుకోవాలని కార్యశాల కన్వీనర్ డా.వి.చంద్రమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు తగిన సమాచారం అందించాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




ప్రజాస్ఫూర్తి, భైంసా: జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు శాఖల వారిగా సంబంధిత సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని జనాభా, అక్షరాస్యత, భౌగోళిక పరిస్థితులు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, వివిధ ప్రభుత్వ శాఖల వారీగా లభ్యమయ్యే సమాచారాన్ని అత్యంత ఖచ్చితత్వంతో సేకరించాలని చెప్పారు. భవిష్యత్తులో జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు, భౌగోళిక, సంస్కృతిక అంశాల్లో అభివృద్ధికి ఈ సెన్సస్ హ్యాండ్ బుక్ ప్రామాణికంగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రణాళిక, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్య, వైద్యారోగ్య, తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిర్ణీత గడువులోగా నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. వివరాల సేకరణలో ఎలాంటి తప్పులకు తావు ఉండకూడదు అన్నారు. సేకరించిన సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో పునఃపరిశీలించిన తర్వాతే నివేదికలో పొందుపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సిపివో గంగారెడ్డి, ఆర్డీవో దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆరూరులో దివంగత తుమ్మల నరసయ్య 3 వ వర్ధంతి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : దివంగత సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ తుమ్మల నరసయ్య 3 వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఆయన స్వగ్రామమైన నరసయ్య గూడెం ఆరు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు ఈ రెండు గ్రామాలలో ఉన్న తుమ్మల నరసయ్య విగ్రహానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ మాట్లాడుతూ తుమ్మల నరసయ్య సుదీర్ఘంగా కాంగ్రెస్ పార్టీలో ఏళ్ల తరబడి పార్టీ కోసం పని చేసి చివరి ప్రాణం పోయే వరకు కూడాకాంగ్రెస్ పార్టీ జెండాను వదలలేదని వారన్నారు ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరిచిపోలేని మని ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని కోరారు ఆయన బ్రతికున్నంత కాలం నిరంతరం ప్రజల మధ్యనే ఉండి పార్టీకి నిస్వార్థంగా సేవలందించాడని ఆయన చేసిన సేవలు ఏనాడు కూడా చెదిరిపోనివని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్, రాజు, వలిగొండ సింగల్ విండో చైర్మన్ గరిసె రవి, మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్, వలిగొండ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు, నాయకులు చిట్టెడి జనార్దన్ రెడ్డి ,గంగాపురం సతీష్ , కాసుల వెంకన్న గౌడ్, గుండు దానయ్య ,వలిగొండ సింగిల్ విండో వైస్ చైర్మన్ జంగారెడ్డి, ఐటి పాముల రవీంద్ర, బాల శంకర్, మచ్చ గిరి గుట్ట డైరెక్టర్లు రాధారపు రమేష్, కూర వెంకన్న, జినుకల దానయ్య ,బండారు నరసింహారెడ్డి, నరసయ్య ,కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# వేడుక అపూర్వం..... జ్ఞాపకాలు" పది"లం




ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలో రవి బాలనికేతన్ హై స్కూల్ 1999-2000 బ్యాచ్ సిల్వర్ జూబ్లీ అలుమ్ని మీట్ ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు వారి గురువులకు ఘన సన్మానం నిర్వహించారు."మళ్ళీ కలవండి | గుర్తు చేసుకోండి | ఆనందించండి" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 70 మందికి పైగా పూర్వ విద్యార్థులు, 10 మందికి పైగా మాజీ ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. 25 ఏళ్ల తర్వాత వివిధ ప్రాంతాలు, నగరాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా హాజరై ఒకరినొకరు ఆత్మీయంగా మాట్లాడుకుంటూ ,పాఠశాల రోజుల నాటి ఫొటోలు, తరగతి గది జ్ఞాపకాలు, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలు, ఆటలు, సరదా సంఘటనలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఎన్నేళ్ల తర్వాత కలుసుకున్నప్పటికీ తమ మధ్య స్నేహబంధం ఏమాత్రం తగ్గలేదని పలువురు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ , ఎస్పీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ గణేష్ కుప్పాలతో పాటు నిర్వాహక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులతో నిర్వహించిన గ్రూప్ ఫొటో సెషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఆనాటి ఉపాధ్యాయ బృందాన్ని సన్మానించారు.

# భూ రీసర్వేతో ప్రతి భూమికి డిజిటల్ మ్యాప్ తో కూడిన భూధార్ కార్డులు

*** జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డులలోని లోపాలను ఎవరికి అన్యాయం జరగకుండా పారదర్శకంగా భూసమస్యలు పరిష్కారం కావలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గంగారం, బేతుపల్లి నారాయణపురం, రామగోవిందపురం, యం.వి. పాలెం, రామనగర్, పాకాలగూడెం గ్రామాలలో సూమరు 12 వేల ఎకరాలకు భూ సర్వే కొనసాగుతుందని, 10టీమ్ లలో ఇప్పటి వరకు 4 వేల ఎకరాల రైతుల భూములను రీ సర్వే పూర్తి చేశామని కలెక్టర్ వివరించారు. ప్రతి మనిషికి అధార్ లాగా అధునిక యాంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం తో చేసున్న భూ సర్వే ద్వారా ప్రతి రైతు భూమికి డిజిటల్ మ్యాప్ తో కూడిన భూధార్ కార్డు ఉంటుందని తెలిపారు. గ్రామంలోనీ ప్రతి రైతుకు 48 గంటల ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలుస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపిస్తారని, పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. భూ సర్వే కు నోటీసు ఇచ్చిన రైతులు వారి కుటుంబంలో భూ హక్కదారులు, పట్టా పాస్ బుక్ లో భూమి ఉన్న వారు అందరూ తప్పకుండా స్వయంగా సర్వేకు వచ్చి పూర్తి వివరాలు తెలియజేసి, సహకరించాలని కలెక్టర్ కోరారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీసర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట సత్తుపల్లి తహసీల్దారు సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ లు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

# యువ ఆపదమిత్ర శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

*** మేరా యువ భారత్ జిల్లా యువ అధికారి మద్దుల వెంకట రాంబాబు**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ, మేరా యువ భారత్ వారి ఆధ్వర్యంలో యువ ఆపదమిత్ర కార్యక్రమంలో భాగంగా సామాజిక స్పృహ కల్గిన యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లుగా మేరా యువ భారత్ ఖమ్మం జిల్లా యువ అధికారి మద్దుల వెంకట రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. సమాజం వరదలు, కరువు, భూకంపాలు, కరోనా వంటి విపత్కర సమయంలో ఆపత్కాలంలో ఉన్నప్పుడు సహాయక చర్యలు చేపట్టడానికి భద్రతా దళాలకు అండగా ఉండటానికి యువతను సుశిక్షితులను చేసే అద్భుతమైన కార్యక్రమం ఇదని వెల్లడించారు. వారం రోజుల పాటు 6వ బెటాలియన్ టీజీఎస్పీ చాతకొండ, భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే ఈ శిక్షణ శిబిరం అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ఆపత్కాలంలో ఉపయోగకరంగా ఉండే ఒక ఎమర్జెన్సీ కిట్ తో పాటు, శిక్షణ పొందినట్లు ప్రభుత్వ సర్టిఫికెట్ కూడా ఇస్తుందని తెలిపారు. ఖమ్మం / భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వారై ,18 40 ఏళ్ల మధ్యలో ఉండాలన్నారు. 7 వ తరగతి ఉత్తీర్ణత సాధించి మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. ఈ నెల 25 చివరి తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లోని యువత, విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు పెద్దఎత్తున నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.పూర్తి వివరాల కోసం పాత బస్ స్టాండ్ సమీపంలోని మై భారత్ కార్యాలయంలో (నెహ్రూ యువకేంద్రం)గాని, 91773 29258 కు సంప్రదించగలరు.

# ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

*** జెడ్పీ సీఈవో శోభారాణి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్లను జెడ్పీ సీఈవో శోభారాణి మంగళవారం పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల వివరాలను సంబంధిత ఏఈని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఎంపీడీవో శ్రీలత, సర్పంచ్ శ్రీలత సుందర్ లతో కలిసి విద్యార్థులకు నూతన పాఠశాల వస్త్రాలను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో శోభారాణి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మజ, హౌసింగ్ ఏఈ పవన్ కళ్యాణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం.. వైద్య పరీక్షలు తప్పనిసరి

- లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు అవగాహన సదస్సు




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు వై సూర్యశ్రీ, ప్రశాంతి రెడ్డి, అవ్వారు శ్రీనివాస్ ప్రసాద్ లు సూచించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం తంగడపల్లి రోడ్డులోని కళాశ్రీ ఫంక్షన్ హాల్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లైన్స్ క్లబ్ చౌటుప్పల సేవా అధ్యక్షుడు ఎండి అత్ హర్ పాషా, అధ్యక్షత వహించగా, లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్త, ముఖ్యఅతిథులుగా లయన్స్ క్లబ్ నల్లగొండ జిల్లా రీజియన్ చైర్ పర్సన్ సంజీవరెడ్డి, జోన్ చైర్మన్ ఉప్పు ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆహారంలో ఐరన్, పోలిక్ యాసిడ్, కాల్షియం వంటి మందులను వైద్యుల సూచనల ప్రకారం వాడాలన్నారు. గర్భిణీ స్త్రీలకు శుభ్రమైన త్రాగునీరు, పోషకాహారం, తగిన విశ్రాంతి, పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని సూచించారు. అధిక రక్తపోటు, రక్తస్రావం, తీవ్రమైన తలనొప్పి, కాళ్లు, అధికంగా వాపు చూపు మసకబారడం, బిడ్డ కదలికలు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ప్రతి గర్భిణికి సురక్షితమైన గర్భాదరణ ఆరోగ్యకరమైన ప్రసవం, తల్లి బిడ్డ ఆరోగ్యం కోసం కుటుంబ సభ్యులు సహకరించాలన్నారు. గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పై అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి దాచేపల్లి రాజు గుప్త, కోశాధికారి బత్తిని రఘు, నాంపల్లి రమేష్ గుప్త, తిరందాసు జగన్నాథ్, కాసుల వెంకటేశం గౌడ్, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్త, గొపగోని లక్ష్మణ్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, సిలివేరు మంగయ్య, వనం రాజు, సంపూర్ణ చారి, పోలోజు రాజు, పోలోజు శ్రీనివాస చారి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాస్ఫూర్తి, భైంసా: కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. చేశారు. సీసీ కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసిల్దార్ రాజు, అధికారులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మంజ్రి గ్రామంలో వీఓ మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణ పనులకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు వీఓ మహిళా సమైక్య సంఘ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాతినిధులు, మండల సీనియర్ నాయకులు, అధికారులు , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీతారామచంద్రస్వామి వారి మాస కళ్యాణం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీవేదాంత భజన మందిరంలోని సీతారామ చంద్రస్వామి వారి పునర్వసు జన్మ నక్షత్ర సందర్భంగా మంగళవారం స్వామివారి మాస కళ్యాణంను దేవాలయ అర్చకులు దరూరి సింగరాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహములకు పంచామృత అభిషేకం నిర్వహించారు.పట్టు వస్త్రాలు అలంకరింపజేసి, వివిధ రకాల పూలతో అలంకారం చేసి వివిధ రకాల పండ్లతో నైవేద్యం సమర్పించారు. శాస్త్రోక్తంగా కళ్యాణతంతును నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీవేదాంత భజన మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నకరకంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్,ఈగ వెంకటేశ్వర్లు, షీలా శంకర్, సోమ సుమన్, వాసా కృష్ణ, చంద్రశేఖర్, చింత వెంకన్న, అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, మందిర మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలులో ప్రతి అంశంపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలి

* జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలుకు సంబంధించి జిల్లా, మండల, గ్రామ స్థాయిలో గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించి, తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు తీరుపై ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మానిటరింగ్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ గుర్తింపు కార్డులు కేవలం సభ్యుల గుర్తింపు కోసం మాత్రమేనని, ఎలాంటి ప్రోటోకాల్ లేదా ప్రాధాన్యత కల్పించేందుకు కాదని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులు సివిల్ రైట్స్ డే కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే అర్హులైన బాధితులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసుల విచారణ పూర్తై నివేదిక అందిన తర్వాత ఏ ఫైలును పెండింగ్‌లో ఉంచరాదని, పరిహారం ఫైళ్లను ప్రాధాన్యత ప్రాతిపదికన వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సిపి సునీల్ దత్ మాట్లాడుతూ 2026 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద 62 ఫిర్యాదులు అందాయని తెలిపారు. విచారణ అనంతరం 9 ఫిర్యాదులు తప్పుడు ఫిర్యాదులుగా తేలాయని, 53 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి సంబంధించిన కేసుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేసి, కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఎస్సీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి ముజాహిద్, డిఆర్డిఓ శ్రీరామ్, డిఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డి.డబ్ల్యు.ఓ, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస రావు, సంబంధిత కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వందే భారత్ అవార్డుకు జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ ఎంపిక

* సంచలనాత్మక కథనాలకు కేరాఫ్..
* నాడు డాక్టరేట్,నంది అవార్డు.. నేడు వందే భారత్ అవార్డు..
* ప్రస్తుతం పీపుల్స్ డైరీ ఖమ్మం ప్రతినిధిగా విధులు





ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ వందే భారత్ జాతీయ అవార్డుకి ఎంపికయ్యారు.. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ గత 13 సంవత్సరాలుగా వివిధ ఛానెల్స్, పత్రికల్లో, వివిధ హెదాల్లో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారు. అనేక అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా ప్రజా సమస్యలను వెలికి తీస్తూ ప్రభుత్వాల ద్వారా వాటిని పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ విధంగా సమాజానికి సేవచేస్తూ సీనియర్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్నందుకు అతని సేవలను గుర్తించి ఈ నెల ఆగష్టు 15వ తేదీన శనివారం రోజున హైదరాబాద్ రవీంద్ర భారతి లోని పైడి జయరాజు ప్రివ్యూ థియేటర్ 2వ అంతస్థు లో జరిగే వందే భారత్ అవార్డు పురస్కారం కార్యక్రమంలో ప్రముఖ సినీ గీత రచయిత జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు చేతుల మీదుగా ప్రధానం చేస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ "పీపుల్స్ డైరీ" దినపత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక సంచలనాత్మక కథనాలను అందించారు. ఎక్కడ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నా ఎలాంటి శక్తుల ఒత్తిళ్లకు లొంగకుండా నిర్భయంగా వార్తలు అందించడంలో దిట్ట... జర్నలిజం వృత్తినే శ్వాసగా... నైతిక విలువలను పాటిస్తూ పేదల పక్షాన నిలువడం, అన్యాయాన్ని ఎదురించడం లక్షణం.. అక్రమార్కుల బెదిరింపులకు వెరువకుండా, అక్రమ కేసులకు సైతం భయపడకుండా ఎంచుకున్న దారిలో దూసుకెళ్తూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వందే భారత్ జాతీయ అవార్డు రావడం పట్ల స్థానిక సీనియర్ జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలుపుతూ సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

# చెంగిచర్ల–చర్లపల్లి, చెంగిచర్ల డిపో కుపోయే రోడ్ల పై భారీ గుంతలు!

* బస్సులు నడపాలంటే భయంగా ఉంది.. వెంటనే ప్యాచ్‌వర్క్ చేపట్టాలి
* చెంగిచెర్ల డిపోకు వెళ్లే మార్గం మరి అధ్వానంగా మారింది
* ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల ఆవేదన



మేడిపల్లి , ప్రజాస్ఫూర్తి :చెంగిచర్ల నుంచి చర్లపల్లి వెళ్లే ప్రధాన రహదారి భారీ గుంతలతో అధ్వానంగా మారింది. ఈ మార్గంలో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండటంతో గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా చెంగిచెర్ల ఆర్టీసీ డిపోకు వెళ్లే మార్గం గుంతలతో నిండిపోవడంతో బస్సులు నడిపే డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాటి లోతు కనిపించక ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ఈ సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్ రఘుపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతిరోజూ ఈ రహదారిపై బస్సులు నడపాల్సి వస్తోందని, భారీ గుంతల కారణంగా బస్సులను జాగ్రత్తగా నడపాల్సి వస్తుందని తెలిపారు. గుంతల వల్ల బస్సులకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రయాణికుల భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. "ప్రస్తుతం శాశ్వత రహదారి పనులు చేపట్టడానికి సమయం పట్టినా, కనీసం గుంతలపై అత్యవసరంగా ప్యాచ్‌వర్క్ అయినా చేపట్టాలి. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును ప్రయాణానికి అనుకూలంగా మార్చాలి" అని రఘుపాల్ రెడ్డి కోరారు. రహదారి మరమ్మతులు చేపట్టకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గుంతలను పూడ్చి ప్యాచ్‌వర్క్ చేపట్టాలని వారు కోరుతున్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి; విద్యార్థి దశ ఎంతో విలువైనదని,ఈ దశ లో చెడు అలవాట్లకు, ముఖ్యంగా మత్తు పదార్థాలకు (డ్రగ్స్) దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకుంటేనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ డి. నాగేశ్వరావు పిలుపునిచ్చారు.మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు "మాదకద్రవ్యాల నిర్మూలన యువత బాధ్యత" అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది వై. చెన్న మల్లా రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో కొందరు యువకులు క్షణికానందం కోసం, స్నేహితుల ఒత్తిడి వల్ల డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మాదకద్రవ్యాల రవాణా, వినియోగం వెనుక ఉన్న కఠినమైన చట్టాల గురించి, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం నేరస్థులుగా మిగిలిపోవడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగాలకు, విదేశీ ప్రయాణాలకు అర్హత కోల్పోతారని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్ కృష్ణ తెలిపారు. అనంతరం న్యాయవాది వి.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు వంటి దురాచారాలకు పాల్పడి తమ పిల్లల జీవితాలను నాశనం చేయవద్దన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను ఎవరైనా లైంగికంగా వేధించినట్లయితే వారు పోక్సో చట్టం కింద కఠినంగా శిక్షించబడతారని హెచ్చరించారు. ఎవరైనా న్యాయపరమైన సలహాలు సూచనలు కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేసి న్యాయ సలహాలు పొందవచ్చు అన్నారు . అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మన్ నాయక్ మాట్లాడుతూ..సమాజంలో గొప్ప విజేతలుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల, బోధన సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన బొమ్మెన శ్రీశైలం (25) అనే యువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రాత్రి సుమారు 10 గంటలకు శ్రీశైలం ఇంటికి వచ్చి తన గదిలోకి నిద్రించేందుకు వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో అతని పిన్ని మేకల రాజవ్వ గదిని శుభ్రం చేసేందుకు వెళ్లగా, శ్రీశైలం దూలానికి చీరతో వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించగా శ్రీశైలం అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి తండ్రి బొమ్మెన మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ ఎస్ ఐ జ్యోతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భూగర్భ జల సంరక్షణకు జలసిరి

- ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భూగర్భ జల సంరక్షణ కోసమే జలసిరిలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టామని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతకు సర్పంచ్ జువ్వి నర్సింహ్మా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు వృధా కాకుండా, భూగర్భంలోకి వెళ్లేందుకు ఇంకుడు గుంతలు దోహదపడతాయన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు వీలుగా, నీటి మట్టాల పెంపుదలకు ఇంకుడు గుంతలు ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. భూగర్భంలో నీటిమట్టం పెంపొందించడం ఇంకుడు గుంతలతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామంలో సాధ్యమైనంత వరకు ఇంకుడు గుంతలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సామిడి సంధ్య, ఐతరాజు శారద, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, గునుగంటి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదు

బి ఆర్ ఎస్ వి మండల అధ్యక్షుడు ఎండి నవాజ్



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: విద్యార్థుల భవిష్యత్తుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని బి ఆర్ ఎస్ వి మండల అధ్యక్షుడు ఎండి నవాజ్ విమర్శించారు. సోమవారం ముస్తాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా విద్యార్థులకు ప్రభుత్వ యూనిఫామ్స్ పంపిణీ చేయకపోవడాన్ని నిరసిస్తూ బి ఆర్ ఎస్ వి మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి (ఎంఈఓ)కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా యూనిఫామ్స్ పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి విద్యార్థులందరికీ యూనిఫామ్స్ అందేలా చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ వి మండల అధ్యక్షుడు ఎండి నవాజ్, మొట్టయిపల్లి ఉప సర్పంచ్ పల్లె ఆనంద్, బి ఆర్ ఎస్ వి నాయకులు ముక్క గుణశేఖర్, కస్తూరి సాయి, బండ రమేష్, కొల్లూరి మహేష్, సృజిత్, దేవేందర్, మహేష్, ప్రభాస్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

22 మంది లబ్ధిదారులకు రూ.22.02 లక్షల విలువైన చెక్కులు అందజేత



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచేలా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన చెక్కులను మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు.మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, తహసీల్దార్ తో కలిసి 22 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను అందజేశారు. మొత్తం రూ.22,02,552 విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బందితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చలివాగు నీటిని విడుదల చేయాలి

* **పంటలను ఆదుకోవాలి.. రైతులను కాపాడాలి: గండ్ర వెంకట రమణారెడ్డి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజా స్ఫూర్తి: చలివాగు ప్రాజెక్టు నుంచి వెంటనే నీటిని విడుదల చేసి ఆయకట్టు పరిధిలోని పంట పొలాలను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రేగొండ మండలం చెన్నపూర్ ఎక్స్ రోడ్డు వద్ద నీటి విడుదల కోసం రైతులు చేపట్టిన రాస్తారోకోకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం శాయంపేట మండలం జోగంపల్లి వద్ద చలివాగు ప్రాజెక్టు, పంపుహౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలివాగు ప్రాజెక్టు తూములు ఎత్తి ఆయకట్టు ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలని 15, 20 రోజులుగా ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతులు నార్లు పోసి 45 రోజులు గడిచిందని, నాట్లు వేసుకునేందుకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఐదు, ఆరు పంపులు మాత్రమే



పనిచేస్తున్నాయని, ఒకసారి మరమ్మతులు, మరోసారి విద్యుత్ సమస్య అంటూ కారణాలు చెబుతున్నారని విమర్శించారు. మొత్తం తొమ్మిది పంపులను పూర్తిస్థాయిలో నడిపించాలని డిమాండ్ చేశారు. తొమ్మిది పంపులు పనిచేస్తే నెలకు సుమారు ఆరు టీఎంసీల నీటిని పంపింగ్ చేయవచ్చని, ఆరు నెలల్లో 36 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తే పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని రైతులకు నీరు అందిస్తూ, ఇక్కడి రైతుల పంట పొలాలకు నీరు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వెంటనే తొమ్మిది పంపులను ఆన్ చేసి పంటలకు నీరు అందించాలని కోరారు.

**24 గంటల్లో నీరు విడుదల చేయాలి**

రైతుల డిమాండ్ మేరకు 24 గంటల్లో చలివాగు నీటిని విడుదల చేయకపోతే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని గండ్ర వెంకట రమణారెడ్డి హెచ్చరించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు కొనసాగుతాయని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి ప్రకృతి తెచ్చిన కరువు కాదని, ప్రభుత్వ వైఫల్యం కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు. గోదావరి, కృష్ణా నదుల్లో నీరు ప్రవహిస్తున్నా పంట పొలాలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం సరైన విధానాలను అవలంబించి చలివాగు పంపులను పూర్తిస్థాయిలో నడిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ ఉద్యోగ భద్రత కల్పించాలని, వారిని పర్మినెంట్ చేయాలని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ జె రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఆర్టీసీ ఔట్సోర్సింగ్ డ్రైవర్స్ అండ్ కండక్టర్స్ కార్మికుల జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థల లో పర్మినెంట్ కార్మికులవలె సమానంగా పని చేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులను ఉద్యోగ భద్రత కల్పించాలని, శ్రమ దోపిడిని అరికట్టాలని , జీతం ఇవ్వకుండా పిఎఫ్ లెక్కలు చూపెట్టకుండా మధ్య దళారులు చేతిలో అవినీతి జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ , వారి కుటుంబానికి కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, ఎస్ డబ్ల్యూ ఎఫ్ బ్రాంచ్ అధ్యక్ష,,కార్యదర్శులు బత్తుల నాగేశ్వరరావు, సామ్యూల్, రఫీ, సంఘ నాయకులు రాంప్రసాద్ , రాజు , ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

చేతివృత్తుల అభివృద్ధికి పీఎం విశ్వకర్మ యోజన దోహదం

## మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం జిల్లాల పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారుల అవగాహన సదస్సును జిల్లా కోఆర్డినేటర్ ఆకుల నాగేశ్వరరావు గౌడ్ అధ్యక్షతన కొత్తగూడెం పట్టణంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, బూర నర్సయ్య గౌడ్ పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశంలోని చేతివృత్తుల వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పీఎం విశ్వకర్మ యోజనను ప్రవేశపెట్టారని , సంప్రదాయ చేతివృత్తుల్లో నైపుణ్యం కలిగి ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చని , పథకం ద్వారా అందే శిక్షణ, పనిముట్లు, రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని తమ వృత్తులను అభివృద్ధి చేసుకోవడంతో పాటు కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పైడిపాటి రవీందర్,జిల్లా నాయకులు సీతారాం నాయక్, జల్లారపు శ్రీనివాస్,రాయుడు నాగేశ్వరరావు, ఎడ్లపల్లి శ్రీనివాస్, నరసింహారావు, కనుకుంట్ల రాజమౌళి, తెలంగాణ క్రాంతి, భూక్య రాజేష్ నాయక్, గూడ విజయ తదితరులు పాల్గొన్నారు.

## తళ సప్తమి వేడుకల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డిబి గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో తళ సప్తమి వేడుకల్లో వేడుకల్లో ముధోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్, పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. తళ సప్తమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఎంలో సీటు పొందిన భూక్య తేజస్వినికి ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పెద్దతండా గ్రామ పంచాయతీకి చెందిన భూక్య తేజస్విని దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో ఒకటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ లో సీటు సాధించిన భూక్య తేజస్విని ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్ ఆధ్వర్యంలో తేజస్వినికి శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీటు సాధించడం జిల్లాకే గర్వకారణమని, తేజస్విని సాధించిన విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు .

## దేవాదుల నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి

* **తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే జీఎస్సార్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : దేవాదుల ప్రాజెక్టు నీటి నిర్వహణ, నీటి లభ్యత, పంపుహౌస్‌ల పనితీరుపై ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మంగళవారం హన్మకొండ జిల్లా చింతగట్టులోని చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రానున్న రోజుల్లో తాగునీటి కొరత తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

* **గణపసముద్రం చెరువు నింపాలి**

భీమ్‌ఘనపూర్ చెరువు నుంచి వస్తున్న నీటిని రామప్ప చెరువు నుంచి వయా వంగపెల్లి వానిచెరువు మీదుగా గణపసముద్రం చెరువులోకి విడుదల చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గణపసముద్రం చెరువులో నీటి నిల్వ ఉంటే భూపాలపల్లి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. రామప్ప చెరువు నుంచి నీటిని విడుదల చేయడం ద్వారా మిషన్ భగీరథ పథకం ద్వారా ఎనిమిది మండలాలకు తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. అలాగే పరకాల చలివాగులోనూ తగినంత నీటి నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

**నీటి నిల్వలపై అధికారుల హామీ**

ఎమ్మెల్యే సూచనలపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు గణపురం చెరువులో 25 అడుగుల నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరకాల చలివాగులో 17 అడుగుల నీటి నిల్వ ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు.ప్రజలకు తాగునీటి కొరత రాకుండా ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని గండ్ర సత్యనారాయణరావు సూచించారు. నీటి లభ్యత, వినియోగం, పంపుహౌస్‌ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. సమీక్షా సమావేశంలో ప్రజాప్రతినిధులు కడియం శ్రీహరి, నాగరాజు, యశస్విని రెడ్డితో పాటు ఇరిగేషన్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు



* **బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బి ఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిరిసిల్ల గడ్డ కేటీఆర్ అడ్డా అని స్పష్టం చేశారు. ఒకప్పుడు ఉరిసిల్లగా ఉన్న సిరిసిల్లను అభివృద్ధి చేసి సిరిశాలగా మార్చిన ఘనత కేటీఆర్ కే దక్కుతుందన్నారు. కేటీఆర్ సిరిసిల్లకు ఏం చేశారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించడం వారి మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లకు ఏం చేసిందో చెప్పాలని, దమ్ముంటే అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావలసిందిగా సవాల్ విసిరారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు బుద్ధి తెచ్చుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలని, లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొందపెట్టడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో మండల యూత్ అధ్యక్షుడు శీలం స్వామి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎండి నవాజ్, పట్టణ యూత్ అధ్యక్షుడు యాదగిరి, బద్దిపడగ నందు, సుంచు కృష్ణ, మొల్లయిపల్లి ఉప సర్పంచ్ సుంచు మహేష్, ముక్క గుణశేఖర్, మేర నర్సింలు, సోషల్ మీడియా నాయకులు అనమేని ఆంజనేయులు, కట్ట దేవరాజ్, తుమ్మలపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కొట్టే చెప్పులు కుట్టే మాదిగలకు నెలకు రూ.5000 లు పెన్షన్ మంజూరు చేయాలి

* **టి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా, వినతి.**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి టి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు శిరసానోళ్ల బాలరాజు నాయకత్వంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం వినతి పత్రం అందజేసిన టిఎంఆర్పిఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు ఉటుకూరి కృష్ణ, సూర్యపేట జిల్లా అధ్యక్షులు కత్తి ఉపేందర్ మాదిగ. టి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి దళిత కుటుంబానికి అంబేద్కర్ అభయ హస్తం క్రింద 12 లక్షల రూపాయలు వెంటనే అమలు చేయాలని,మాదిగ దండోరా ఉద్యమకారులకు హైదరాబాదులో 250 గజాల ఇంటి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందజేయాలని, విద్య హక్కు చట్టం 2009 తెలంగాణ రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఎస్సీలకు 15% నుంచి 20% వరకు రిజర్వేషన్ పెంచాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్సీలకు 25 శాతం పూర్తిస్థాయిలో ఉచిత విద్యను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్పిఎస్ నాయకులు చిందాల సంపత్ ,కల్లెపురం అశోక్, పల్లె నాగయ్య వస్కుల కనకయ్య, బొజ్జ వెంకులు శ్రీనివాస్, పాతకోట్ల రమేష్, మామిడి సైదులు, గంగ బేరి శ్రీనివాస్, దంతాల వెంకటయ్య దుబ్బ రమేష్, కత్తి రవీందర్, పాల్వాయి వెంకటయ్య, దుబ్బా శ్యామ్, కంసాలపల్లి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ టీచర్ పాఠశాలలు ఉండకూడదు

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని ప్ర భుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధి కారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయు లను సర్దుబాటు చేసి, ఏ పాఠశాల కూడా సింగిల్ టీచర్ పాఠశాలగా ఉండ కుండా చర్యలు చేపట్టాలని సూచించా రు. మంగళవారం కలెక్టరేట్ లో ఎంఈఓ లు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లతో నిర్వహిం చిన సమీక్ష సమావేశంలో పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, ఉపాధ్యాయుల లభ్యత, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై కలెక్టర్ సమీక్షించారు. ఉపా ధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యతనిస్తూ వర్క్ అడ్జస్ట్‌మెంట్ చే పట్టాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వెనుకబడి న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయు లు,విద్యార్థుల హాజరు,బోధనా ప్రక్రియ, పారిశుధ్యం, మౌలిక వసతులను అధి కారులు క్రమం తప్పకుండా తనిఖీ చే యాలన్నారు. 'మిషన్ శిఖరం' కింద పా ఠశాలల వాస్తవ పరిస్థితులను ప్రతిబిం బించేలా నివేదికలు రూపొందించాలని, అవసరమైన భవనాలు, తరగతి గదు లు, విద్యుత్, తాగునీరు, మరుగు దొడ్ల వంటి సదుపాయాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీ.అర్.టి లు పాఠశాలలను నిరంతరం సందర్శించి ఉపాధ్యాయులకు అకడమిక్ సపోర్ట్ అందించాలన్నారు.అన్ని పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, వి ద్యార్థులు అన్‌అకాడమీ తరగతులను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిం చాలని తెలిపారు. 'ఫాస్ట్ మ్యాథ్స్' పుస్త కాలతో రోజువారీ సాధన చేయించి గణి త నైపుణ్యాలను పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశం లో విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసి యా బేగం తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస పథకం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కల్పిస్తానని ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం ఎప్పుడు అమలు అవుతుందని ప్రగతిశీల యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల రంగయ్య అన్నారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం మహబూబాబాద్ లోని మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు కురుసం సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రంగయ్య మాట్లాడుతూ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని,జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తున్నామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి నేటికీ ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని,జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని, వర్షాకాలం సీజన్లో గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు పరీక్షలు నిర్వహించడానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని రంగయ్య కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకపోతే ఢిల్లీ జంతర్ మంతర్ లో జరిగిన జెంజీ తరహా పోరాటాలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో పి వై ఎల్ జిల్లా నాయకులు పూణెం రవికుమార్,జోగా సతీష్,మంకిడి సాయి కుమార్, బానోత్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో 5 ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజా స్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం. రాజేందర్ తెలిపారు. అర్హత కలిగిన జిల్లావాసులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని కేజీబీవీల్లో స్వీపర్ కమ్ స్కావెంజర్ 1, హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టేకుమట్ల కేజీబీవీలో స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు ఒకటి, పాలిమెల కేజీబీవీలో హెడ్ కుక్ పోస్టు ఒకటి, ఘనపూర్, మల్హర్రావు, మొగుళ్లపల్లి కేజీబీవీల్లో అసిస్టెంట్ కుక్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. స్వీపర్ కమ్ స్కావెంజర్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా పేర్కొన్నారు. హెడ్ కుక్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు పెద్ద సమూహాలకు వంట చేసిన అనుభవం ఉండాలి. ఎంపిక ప్రక్రియలో కమిటీ ముందు వంట చేసి చూపించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 11 నుంచి 17వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని డీఈవో సూచించారు.

# అటవీ హక్కుల లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తి అండ

**: జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : అటవీ హక్కుల పత్రాలు పొందిన గిరిజనులు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల సమస్యల పరిష్కారంతో పాటు వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.మంగళవారం ఉట్నూరులోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనంలో దొంగచింత, బీర్సాయిపేట్ గ్రామ పంచాయతీల పరిధిలో "షెడ్యూల్డ్ తెగలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం-2006 అమలుపై పైలట్ సామాజిక తనిఖీ - ప్రజా వేదిక" కార్యక్రమం నిర్వహించారు. సీఏజీ, క్రిస్ప్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరంద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు గిరిజన రైతులు తమ సమస్యలు, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రభుత్వ పథకాల అమలుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ హక్కుల పత్రాలు పొందిన రైతులకు పంట రుణాలు, రైతు భరోసా, వ్యవసాయ రాయితీలు, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు వాస్తవంగా అందుతున్నాయా లేదా అనే అంశాలను ఈ సామాజిక తనిఖీ ద్వారా సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.పట్టాదారులు మరణించిన సందర్భాల్లో వారి వారసుల పేర్లకు అటవీ హక్కుల పత్రాలు బదిలీ చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. అర్హులైన వారసులు ఐటీడీఏ లేదా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.పట్టా ఉన్నా లేకపోయినా అటవీ భూముల్లో సాగు చేస్తున్న అర్హులైన రైతులకు ఫెర్టిలైజర్ యాప్ ద్వారా ఎరువులు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా మార్కెట్‌లో తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకునేలా అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. కోర్ ఏరియాలో ఇప్పటికే తవ్విన బోరు బావులను వినియోగంలోకి తీసుకురావడానికి సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు కల్పించే విషయంలో అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేస్తామని చెప్పారు. వితంతువులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన లబ్ధిదారులు ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలతో తమ గ్రామ పంచాయతీ కార్యదర్శి వద్ద వెంటనే దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ పెన్షన్ పథకాల ప్రయోజనాలు పొందాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరంద్ మాట్లాడుతూ, అడవుల్లో తరతరాలుగా నివసిస్తున్న గిరిజనులు, ఉద్దేశంతోనే అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006 అమలులోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా సాగు హక్కులు, నివాస హక్కులు, సామూహిక అటవీ హక్కులు, అటవీ వనరుల వినియోగ హక్కులు వంటి నాలుగు ప్రధాన హక్కులు లబ్ధిదారులకు కల్పించబడుతున్నాయని వివరించారు. చట్టం అమలు ద్వారా నిర్దేశించిన లక్ష్యాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు నెరవేరుతున్నాయో స్వతంత్రంగా అంచనా వేయడానికే క్రిస్ప్ సోషల్ ఆడిట్ బృందం ఈ సామాజిక తనిఖీ నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగాధర్, ఉట్నూర్ ఆర్డీఓ మోహన్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్, ఏపీవోలు వసంత్ రావు, భాస్కర్, కిసాన్ గిరిజనమిత్ర కోఆర్డినేటర్ హర్ష, అటవీ, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, క్రిస్ప్, కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ విజయ పాల కేంద్రమును తరలించవద్దు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు లో గల ప్రభుత్వ విజయ పాల డైరీ తరలించే చర్యలు మానుకోవాలని కోరుతూ మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విజయ పాల డైరీ ని తరలించే చర్యలను మానుకొని తక్షణమే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. భవనం నిర్మించి 25 సంవత్సరాలు అవుతున్నందున శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో వెంటనే నిధులు మంజూరు చేసి కొత్త భవనం నిర్మించేందుకు కృషి చేయాలని తెలిపారు. 10 టెస్టింగ్ మిల్క్ అనలైజర్ (మిషిన్) లను తక్షణమే డైరీలో ఏర్పాటు చేయాలన్నారు. రెండువేల లీటర్ కెపాసిటీ తో ఏర్పాటు చేసిన విజయ డైరీ కేవలం నేడు 300 లీటర్ల పరిమితమైందని అధికారులు తగు చర్యలు తీసుకొని గ్రామాల్లో పాలా సేకరణ సెంటర్లను ఏర్పాటు చేయాలని పాల రైతులను, పాడి రైతులకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి పాల ఉత్పత్తిని పెంచాలని అన్నారు. 100 స్టెయిన్లెస్ స్టీల్ క్యాన్ లను తక్షణమే డైరీలో ఏర్పాటు చేసి పాల ఉత్పత్తికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే,ఎంపీ, కలెక్టర్ తగు చర్యలు చేపట్టి నిధులు కేటాయించి విజయ డైరీ ని అభివృద్ధి చేయాలన్నారు. ఈ స్థలం కబ్జా కాకుండా కాపాడాలన్నారు. జనరేటర్ రూమ్ కూడా పిచ్చి మొక్కలు చెట్లతో నిండిపోయిందని తొలగించాలన్నారు డైరీ మొత్తం చెట్లు విపరీతంగా పెరిగి పాల రైతులకు ఇబ్బందిగా ఉందని వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి అభివృద్ధి చేయాలన్నారు విజయ డైరీలో సిసి రోడ్ నిర్మించాలన్నారు. ఈ ఆందోళనలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేక వీరన్న,పెరుగు కుమార్,చింతకుంట్ల వెంకన్న,నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, పాల రైతు మారినేని మోహన్ రావు, కూరాకుల పాల్, మంద శంకర్,అల్లి వేణుగోపాల్ రెడ్డి, గార రవిచంద్రబోస్, తండ శ్రీనాథ్, నక్క నాగార్జున, డొనికేని రమేష్,నూకల సాయి,గుంటోజూ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంప్రదాయంలో అమ్మవారి బోనాల ఉత్సవాలు ఎంతో ప్రసిద్ధిగాంచినవి

*** బి.ఆర్.ఎస్ నాయకులు కొలుకుల జైహింద్**



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సాంప్రదాయంలో అమ్మవారి బోనాల పండుగ ఉత్సవాలు ఎంతో ప్రసిద్ధిగాంచినవని బి.ఆర్.ఎస్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు. రోడా మేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ లోని అమ్మవారి ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా భక్తులు సమర్పించిన ఒడి బియ్యాన్ని మంగళవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలోఆయన ముఖ్య అతిథులుగా హజరై ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు నిర్వహించిన ఒడి బియ్యం అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జైహింద్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో బస్తీ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ, నర్సింగ్, సంతోష్, మురళి, ప్రభాకర్, నాగరాజు, యాదగిరి, విగ్నేష్, సీతారాములు, ఖయ్యూం, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## 15.7. కేజీల గంజాయి పట్టివేత



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఖమ్మం ప్రాంతానికి రైల్లో గంజాయి వస్తుందనే సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ సి అండ్ డి టీములు ఖమ్మానికి వెళ్లాయి. మోతి నగర్ సమీపంలో ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో అనుమాన స్పదంగా కనిపించినటువంటి సంచుల్లో ఉన్న గంజాయిని పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయిని తూకం వేయగా 15.7 కేజీలుగా ఉందని అంచనా వేశారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 8 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు.గంజాయిని తీసుకువచ్చిన వ్యక్తులు మాత్రం ఎవరు అనేది తెలియ రాలేదు.దీంతో పట్టుకున్నటువంటి గంజాయిని ఖమ్మం టు ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సి అండ్ డి ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ సి ఐ లు వెంకటేశ్వర్లు నాగరాజులు తెలిపారు.

## పేకాట స్థావరంపై సీసీఎస్ దాడి.. 9 మంది పట్టివేత



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ఘనపూర్ మండలంలోని సీతారాంపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై సీసీఎస్ బృందం మంగళవారం సాయంత్రం దాడి చేసింది. పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.7,990 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, తొమ్మిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులతో పాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఘనపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్హెచ్ఓ కు అప్పగించారు.కాగా, ఈ ఘటనలో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడి కోసం గాలింపు కొనసాగుతున్నట్లు తెలిపారు.

## ప్రజలకు నిష్పాక్షిక సేవలందించాలి

*** ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,ప్రజా స్ఫూర్తి : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నిష్పాక్షికంగా సేవలందించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ పోలీసు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటారు.స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణను ఎస్పీ పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి.. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### పెండింగ్ కేసులపై సమీక్ష

స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతిని ఎస్పీ సమీక్షించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసు రికార్డులను నవీకరించాలని ఆదేశించారు. స్టేషన్, కేసు రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రౌడీషీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పించి, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేలా సేవలందించాలని ఎస్పీ సూచించారు. ప్రజల్లో పోలీసుశాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జునరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కుత్బుల్లాపూర్ కళాకారుల బోనాల జాతర



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఆషాడ మాస అమ్మవారి బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రాదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ , చైతన్య విద్యా నికేతన్ విద్యా సంస్థల ఫౌండర్ &చైర్మెన్ డా. శివరాత్రి యాదగిరి అన్నారు. మంగళవారం గాజులరామారంలోని పద్మావతి కన్వెన్షన్ హాల్ లో జరిగిన కుత్బుల్లాపూర్ కళాకారుల బోనాల జాతరలో ఆయనతో పాటు మాజీకార్పొరేటర్ రావుల శేషగిరిరావు,పలువురు కళాకారులు పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య విద్యా నికేతన్ హై స్కూల్ మగ్దుంనగర్, లెనిన్ నగర్ విద్యార్థులు పాల్గొని పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గీత, కవిత, ప్రవళిక, మోనిక తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పింఛన్లకు 31లోగా దరఖాస్తులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరుకు అర్హులైన కొత్త లబ్ధిదారులు ఈ నెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డీఆర్డీఓతో పింఛన్ల మంజూరు అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకంలో అర్హులైన కొత్త లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, సికిల్‌సెల్ డిసీజ్, హిమోఫిలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక, 99 రోజుల గ్రామసభలు, ప్రజావాణి కార్యక్రమాల్లో ఇప్పటికే అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హులు అవసరమైన ధ్రువపత్రాలతో తమ దరఖాస్తులను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు సమర్పించి తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో బాలకృష్ణ, డీపీఎం రవి తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలతోనే నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

*** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి,జిల్లా గ్రంథాలయ పాఠకులు పోటీ పరీక్షల సంబంధించిన పుస్తకాలు పాఠకుల సౌకర్యార్థం కోసం ప్రతి చదువరికి పుస్తకం ఉండాలని తలంపుతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి తన సొంత ఖర్చులతో 30 వేల రూపాయల కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంబంధించిన గ్రూప్ వన్,గ్రూప్ టు ,ఎస్సై , కానిస్టేబుల్స్ ,బ్యాంకు,జూనియర్ లైన్ మెన్,అట్లాస్ ఇండియన్ పాలిటి, తెలంగాణ చరిత్ర ,భారత చరిత్ర , ఇంకా అనేక పుస్తకాలు,జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు తెలియని ప్రపంచాన్ని మనకు చూపించి మన నడవడిక ఆలోచనలు సక్రమార్గంలో పయనించడానికి భావితరాల విజ్ఞానం కోసం పుస్తకానికి మించిన సాధనం ఏది లేదని,కాబట్టి ప్రతి పాఠకుడు ఈ కాంపిటీటివ్ పుస్తకాలను వినియోగించుకొని పోటీ పరీక్షల్లో విజేతలై తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుస్తూ, సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు.అనంతరం గ్రంథాలయ పాఠకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఔదార్యానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ,జి విజేందర్ ,రుద్రారపు వీరేందర్,నరసింగం శ్రీనివాస్,మందుల రఘు,భూలక్ష్మి యాదమ్మ గ్రంథాలయ పాఠకులు గోపాల్ ,నవీన్,సురేష్ ప్రవల్లిక ,జ్యోతి , శారద తదితరులు పాల్గొన్నారు.

## ఛలో కలెక్టరేట్ ను జయప్రదం చేయండి

*** జిల్లా అధ్యక్షులు మంద నాగకృష్ణ**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ,ఫీజు రియంబర్స్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 13న ఛలో కలెక్టరేట్ ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మంద. నాగక్రిష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ నాయకులు నాహిద్ పాషా , శ్రావణ్, మాహీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాస గోరింటాకు కార్యక్రమం



జనగామ, ప్రజాస్ఫూర్తి : భారతీయ జన తా పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్య క్షురాలు జీవనజ్యోతి ఆధ్వర్యంలో ఆ షాఢ మాస గోరింటాకు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సౌడా రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సౌడా రమేష్ మాట్లా డుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు కార్యక్రమం నిర్వహించడం సంప్రదా యానికి ప్రతీక అన్నారు. మహిళలు, ప్రజలు సుఖసంతోషాలతో, అష్ట ఐశ్వ ర్యలతో వర్ధిల్లాలి,పాడిపంటలు సమృ ద్ధిగా పండాలని ఆకాంక్షించారు. మహి ళలకు గౌరవం ఉన్న చోటే దేవతలు, అష్ట అశ్వర్యాలు కొలువై ఉంటాయని అన్నారు. మహిళల అభ్యున్నతికి భా రతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. మహిళలకు రాజ్యాధికారం లో సముచిత భాగస్వామ్యం కల్పించేం దుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభు త్వం 33 శాతం రిజర్వేషన్ కల్పించేం దుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉ మారాణి, మాజీ కౌన్సిలర్లు శ్రీలత, శివ బోయిన అనురాధ, జిల్లా నాయకురా లు మాలతి, మహిళా మోర్చా నాయ కులు ఉమారాణి, శ్రీలత, నీలిమ, సం తోషిని, బాలమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

## కాటారం కేజీబీవీ బాలికల వసతిగృహంలో ఏఎన్ఎం పోస్టు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం మండలం గంగారం తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల వసతిగృహంలో ఖాళీగా ఉన్న ఒక ఏఎన్ఎం పోస్టును భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాహుల్ శర్మ తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినులు/ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం పోస్టుకు ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 45 శాతం వెయిటేజీ, ఏఎన్ఎం శిక్షణ సర్టిఫికెట్‌లో పొందిన మార్కులకు 45 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. అదనపు వృత్తి విద్యార్హత ఉన్న వారికి గరిష్ఠంగా 10 మార్కుల వరకు వెయిటేజీ కల్పించనున్నారు. జీఎన్ఎం శిక్షణకు 5 మార్కులు, బీఎస్సీ నర్సింగ్‌కు 10 మార్కులు కేటాయించనున్నారు. అభ్యర్థులు ఆగస్టు 11 నుంచి 17వ తేదీ సాయంత్రం 3 గంటలలోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, భూపాలపల్లిలో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు

## ఆటో కార్మికుల రణభేరి.. కలెక్టరేట్ ముట్టడి

జనగామ, ప్రజాస్ఫూర్తి : తమ సమస్య లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు జిల్లా కలెక్టరేట్ ను ముట్ట డించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాని కి పలు డిమాండ్లను వినిపించారు. ఆ టో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప్ర మాద బీమా పథకాన్ని పునరుద్ధరించా లని, ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవ ర్ల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రే షియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

# చలికాలంలో ఊపిరితిత్తులను కాపాడుకోవడం ఎలా?



చలికాలం.. ఊరితిత్తులకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ ఊపిరితిత్తులను ఎలా కాపాడుకోవాలి? శ్వాస కోస వ్యాధులు రాకుండా ఎలా కాపాడుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం. చలికాలంలో ఉష్ణోగ్రత తగ్గుముఖం పట్టడం వల్ల చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. చల్లని, పొడి గాలి, అలాగే వాతావరణ మార్పులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. చల్లని గాలి మన ఊపిరితిత్తులలోకి ప్రవేశించినప్పుడు.. అది శ్వాస సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. దీని వల్ల దగ్గు, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలు వస్తాయి. ఈ పరిస్థితులను ఎదుర్కోవటానికి జాగ్రత్తగా ఉండటం, సరైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. వైద్య నిపుణుల ప్రకారం.. శీతాకాలంలో చల్లని గాలి ఊపిరితిత్తులకు కష్టంగా ఉంటుంది. ఇది మన శ్వాస గొట్టాన్ని ఇబ్బందికి గురి చేస్తుంది. చల్లని, పొడి గాలి కూడా అలెర్జీలు, ఇన్ఫెక్షన్లను పెంచుతాయి.

## చలికాలంలో కాలుష్యం పెరగడమే అతిపెద్ద సమస్య..

చలికాలంలో బలహీనంగా మారిన ఊపిరితిత్తులపై మరింత ఒత్తిడి తెచ్చే పొగ, ధూళి కణాలు ఈ సమయంలో మరింత చురుగ్గా మారతాయి. ముఖ్యంగా ఉబ్బసం రోగులకు, చల్లని గాలి వారి లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. చల్లటి, కలుషితమైన గాలిని పీల్చడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మాత్రమే కాకుండా ఊపిరితిత్తులలో మంట, ఇన్ఫెక్షన్ కూడా వస్తుంది. ఇంతే కాకుండా.. శీతాకాలంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది . శారీరక శ్రమ లేకపోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి, సీజనల్ ఫీవర్, జలుబు వంటి సమస్యలు వస్తాయి.

## తీసుకోవాల్సిన చర్యలు..

ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. సమతుల్య ఆహారం తీసుకోండి. మిమ్మల్ని మీరు హైడ్రేట్ గా ఉంచుకోండి. హైడ్రేషన్ ఊపిరితిత్తులను తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది శ్వాసను సులభతరం చేస్తుంది. దుమ్ము మరియు పొగకు దూరంగా ఉండండి. ఎవరైనా.. శీతాకాలంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ప్రారంభ చికిత్సతో తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. అంతే కాకుండా మీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దుమ్ము, పొగ నుంచి దూరంగా ఉండటం ముఖ్యం.



# పాలు మంచివేనా? ఉబకాయం ఉన్నోళ్లు తాగొచ్చా?

ఇటీవల ఉబకాయం అనే సమస్య చాలా మందిని వేదిస్తోంది. దీంతో ఏ ఫుడ్ తీసుకోవాలో.. ఏ ఫుడ్ తీసుకోవొద్దో తెలియక వారు తికమక పడుతున్నారు. అయితే ఇప్పటివరకు హెల్తీ అనుకున్న పాలు కూడా.. ఇప్పుడు అన్ హెల్దీ అన్న టాక్ వస్తోంది. ముఖ్యమంత్రి ఉబకాయం ఉన్నోళ్లు పాలు తాగొద్దని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.



ప్రస్తుత కాలంలో చాలా మందిని కొవ్వు (కొలెస్ట్రాల్) సమస్య వేధిస్తోంది. దీని కారణంగా శరీర బరువు భారీగా పెరిగిపోతోంది. ఇలాంటి సమస్యను ఎదుర్కొంటున్న వారు ఏం తినాలన్నా, తాగాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంటారు. ఏం తింటే ఏమవుతుందో అనే భయంతో కొన్ని ఆహార పదార్థాలను తినడం, తాగడం మానేస్తున్నారు. ఈ లిస్టులో మొదటి స్థానంలో వచ్చేది పాలు.పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఒకేసారి లభిస్తాయి. అందుకే రోజూ కనీసం ఒక గ్లాసు పాలు తాగాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తారు. పాలు తాగడం వల్ల బలమైన ఎముకలకు అవసరమైన కాల్షియంను అందిస్తుంది. అంతే కాకుండా.. శరీరానికి కావాల్సిన అవసరమైన అనేక ఖనిజాలు, విటమిన్లు పాలలో నుంచి లభిస్తాయి. అయితే.. పాలు తాగితే బరువు పెరగడం కూడా ముడిపడి ఉంది. బరువు పెరుగుతుందనే భయంతో చాలా మంది పాలు తాగరు. అయితే పాలు తాగడం వల్ల ఊబకాయం పెరుగుతుందా..? అనే దానికి వివరాలు తెలుసుకుందాం... పాలలో పోషకాలతో పాటు, కేలరీలు కూడా ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో.. అధిక మొత్తంలో పాలు తాగడం వలన ఊబకాయానికి దారి తీస్తుంది. అయితే, కొన్ని ప్రత్యేక విషయాలపై శ్రద్ధ పెడితే.. పాలు తాగితే బరువు పెరిగే ప్రమాదాన్ని సులభంగా తగ్గించుకోవచ్చు.

పాలు తాగడంవలన బరువు తగ్గే సరైన మార్గం ఏమిటి..?



మీరు మీ బరువును నియంత్రించుకోవడానికి పాలు తాగేటప్పుడు కేలరీలను తగ్గించాలి. అందు కోసం.. ఎక్కువ పరిమాణంలో పాలు తాగడం మానుకోండి. అంతే కాకుండా.. పాలలో కేలరీల పరిమాణాన్ని తగ్గించడానికి, మొత్తం పాలకు బదులుగా స్కిమ్డ్ మిల్క్ తీసుకోండి. అంటే.. పాల నుండి మీగడను పూర్తిగా తీసివేసి తాగండి. 1 గ్లాసు మొత్తం కొవ్వు పాలలో 146 కేలరీలు, కొవ్వు లేని పాలలో 86 కేలరీలు ఉంటాయి. ఈ క్రమంలో.. మీ అవసరాన్ని బట్టి సరైన పాలను తాగాలి. మీరు బరువు తగ్గించే డైట్‌లో ఉన్నట్లయితే.. మీ రోజువారీ కేలరీల కౌంట్‌ను దృష్టిలో ఉంచుకుని పాలను తీసుకోవాలి.

# కాజు హల్వా .. ఇలా ప్రిపేర్ చేసుకోండి.. !



దీపావళి పండగకు చాలా మంది స్వీట్స్ తింటూ ఉంటారు. అలాగే ఇంటికి వచ్చే అతిథులకు బహుమతిగా ఈ స్వీట్స్ ఇస్తూ ఉంటారు. దీనికోసం షాపుల నుంచి స్వీట్స్ తీసుకొని ఇస్తారు. కానీ ఈ దీపావళికి స్వీట్స్ బయటి నుంచి కాకుండా ఇంట్లోనే చేసి తినడడంతో పాటు, మీ ఇంటికి వచ్చిన అతిథులకు కూడా ఇస్తే చాలా బాగుంటుంది. అందుకే కాజు హల్వా అనేది బెస్ట్ ఆప్షన్ అని చెప్పుకోవచ్చు. యితే ఈ కాజు హల్వాను ఎలా చేసుకోవాలి, దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి, ఎలాంటి పద్ధతుల్లో హల్వా చేసుకుంటే రుచి అమోఘంగా వస్తుందనేది ఈ స్టోరీలో చూద్దాం.



| కాజు హల్వా తయారీకి కావాల్సిన పదార్థాలు |
|---|
| గోధుమ పిండి |
| కుంకుమ పువ్వు |
| జీడిపప్పు |
| పంచదార లేదా వీలైతే బెల్లం పొడి |
| నెయ్యి |
| యాలకుల పొడి |
| డ్రై ఫ్రూట్స్ |

**కాజు హల్వా తయారీ విధానం**

ఈ కాజు హల్వా తయారు చేయడానికి ముందుగా జీడిపప్పును మెత్తగా పొడి చేసుకొని పక్కకు పెట్టుకోవాలి. అనంతరం ఒక గిన్నె తీసుకొని అందులో నీళ్లు పోసి మరిగించండి. నీళ్లు మరిగాక అందులో పంచదార లేదా బెల్లం పొడి వేసి, మంటను హైలో పెట్టి అది కరిగేంత వరకు మరిగించుకోవాలి. ఆ సమయంలోనే అందులో యాలకుల పొడి, కుంకుమ పూల రేకులు వేసి కొంచెం సేపు మరిగించుకొని పక్కకు పెట్టుకోవాలి.అనంతరం మరొక గిన్నె తీసుకొని అందులో నెయ్యి వేసి.. అందులోనే గోధుమ పిండి, పిండిలా చేసుకున్న జీడిపప్పును వేయించాలి. ముఖ్యంగా మాడిపోకుండా చూసుకోవాలి. అనంతరం ఆ పిండిలో మనం ముందుగా చేసి పెట్టుకున్న పంచదార లేదా బెల్లం పొడితో చేసుకున్న పాకంను పోసి మెల్లమెల్లగా కలుపుకోవాలి. ఉండలు లేకుండా, మిశ్రమం దగ్గర పడే కొద్దీ కలుపుకుంటూ ఉండాలి. అనంతరం ఒక బౌల్‌లో ఆ హల్వాను వేసుకొని దానిపై కొన్ని డ్రై ఫ్రూట్స్ స్లైసెస్‌ను గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది. దీపావళికి ఎంతో రుచికరమైన కాజు హల్వా సిధమైనట్లే.







# రీల్ పెట్టి రిస్క్‌లో పడ్డాడు

కోలీవుడ్ హీరో చియాన్ విక్రమ్ చిక్కుల్లో పడ్డారు. సోషల్ మీడియాలో సరదాగా చేసిన ఓ రీల్ వైరల్ కావడంతో అది కాస్త వివాదాస్పదమైంది. అరుదైన విదేశీ జాతికి చెందిన ఓ కోతితో కలిసి దిగిన ఓ వీడియోను విక్రమ్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. కోతి హావభావాలను ఇమిటేట్ చేస్తూ కనిపించాడు. ఇది చూసిన నెటిజన్లు విదేశాలకు చెందిన అరుదైన కోతి విక్రమ్ ఇంట్లోకి ఎలా వచ్చిందంటూ కామెంట్లు పెట్టారు. దీంతో విక్రమ్ ఆ వీడియోను డిలీట్ చేశాడు. ఇదిలా ఉండగా తన వియ్యంకుడు, బిజినెస్‌మెన్ సీకే రంగనాథన్ ఇంటికి వెళ్లిన టైమ్‌లో ఆ రీల్ చేశారని చెబుతున్నారు. దీనిపై కొందరు వైల్డ్‌లైఫ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇన్వెస్టిగేషన్ చేస్తున్నట్లు సమాచారం. విక్రమ్‌తో పాటు సీకే రంగనాథన్‌ను విచారించనున్నట్లు చెబుతున్నారు.

# రణబాలి వాయిదా..

## రిలీజ్ డేట్ ఇదేనా?

పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఫస్ట్ టైమ్ జంటగా నటిస్తున్న మూవీ రణబాలి. ఈ మూవీని సెప్టెంబర్ 11న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. అదే వేగంతో షూటింగ్ చేస్తూ వచ్చారు. కానీ రష్మిక గాయం ఎఫెక్ట్ ఈ మూవీ రిలీజ్‌పై పడింది. చెప్పిన డేట్‌కు కాకుండా రెండు నెలలు ఆలస్యంగా రణబాలి థియేటర్లలోకి రానుందని అంటున్నారు. అక్టోబర్ 30ని కొత్త విడుదల తేదీగా మేకర్స్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. దాదాపు ఇదే డేట్ ఫైనల్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కాగా ఈ మూవీకి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నాడు. రాయలసీమ లో ఆంగ్లేయులను ఎదురించి పోరాడిన రణబాలి అనే యోధుడి కథతో ఈ మూవీ తెరకెక్కుతోంది.



# ముక్కుపుడక మింగిన హీరోయిన్.. వైరల్

పంజాబీ హీరోయిన్, గాయని షెహనాజ్ గిల్‌కు సినిమా షూటింగ్‌లో ఊహించని అనుభవం ఎదురైంది. అర్వీందర్ ఖైరా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇష్క్ నామా మూవీ షూట్‌లో ముక్కుపుడక మింగేసింది. ఛేజింగ్ సీన్ చేస్తుండగా ముక్కుపుడక జారి నోటిలో పడడంతో అకస్మాత్తుగా దాన్ని మింగింది. దీంతో శ్వాస ఆడక ఇబ్బందులు పడడంతో షూటింగ్‌ను నిలిపేశారు. సౌరభ్ సచ్‌దేవ్ ఆమె వీపు భాగంలో తడుతూ సాయం చేశాడు. క్షేమంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను హెహనాజ్ తన ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో అది కాస్త వైరల్‌గా మారింది.



# హనుమాన్ సీక్వెల్‌లో వామికా

కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ హీరోగా నటించిన డీసీ మూవీలో చంద్ర అనే వేశ్య పాత్రలో మనసులు కొల్లగొట్టింది వామికా గబ్బి. పదకొండేళ్ల తర్వాత ఓ తెలుగు మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది ఈ అమ్మడు. హనుమాన్ సీక్వెల్‌లో ఛాన్స్ దక్కించుకున్నట్లు సమాచారం. ఓ కీలక పాత్ర కోసం ఈ బాలీవుడ్ బ్యూటీని మేకర్స్ కన్ఫామ్ చేశారట. రాముడికి, హనుమంతుడికి మధ్య వారధిగా వామికా క్యారెక్టర్ సాగుతుందని అంటున్నారు. డీసీలో వామికా గబ్బి నటనకు ఇంప్రెస్ అయిన ప్రశాంత్ వర్మ జై హనుమాన్‌లో కీలక పాత్ర కోసం వామికాను అప్రోచ్ అయినట్లు సమాచారం. ఇందులో రిషభ్‌శెట్టి హీరోగా నటిస్తుండగా రానా దగ్గుబాటి ఓ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. దాదాపు 200 కోట్ల బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తుంది.

# సీనియర్ నటుడు కృష్ణేశ్వరరావు కన్నుమూత



**టాలీవుడ్‌లో విషాదం చోటుచేసుకుంది. సీనియర్ సినీ నటుడు, రచయిత కృష్ణేశ్వరరావు అనారోగ్య సమస్యలతో మంగళవారం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా శ్వాసకోస, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతోన్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గుంటూరు ఏటీ అగ్రహారంలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు.**

రంగస్థల కళాకారుడిగా కృష్ణేశ్వరరావు నట ప్రయాణం మొదలు పెట్టారు. సంపద, రోజు చస్తున్న మనిషి, గుర్తు తెలియని శవం.. వంటి నాటకాలు ఆయనకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. ఆ గుర్తింపుతోనే కృష్ణంరాజు, గౌతమి హీరోహీరోయిన్లుగా నటించిన ప్రచండ భారతం మూవీతో తెలుగు చిత్రసీమకు పరిచయమై కథను అందించారు. శ్రీ రాములయ్య సినిమాకు ఓ రైటర్‌గా పనిచేశారు. జయం మనదేరా, పరశురామ్ సినిమాలకు డైలాగ్స్ సమకూర్చారు. గోపి గోపిక గోదావరి, ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు, కొంచెం టచ్‌లో ఉంటే చెబుతాను మూవీల్లో తన కామెడీతో మెప్పించారు. చందమామ కథలు సినిమాలో పిచ్చివాడి పాత్రకు నంది అవార్డు అందుకున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.